


24న వాల్మీకి దేవాలయ ప్రతిష్ట
మాచవరం: పిన్నెల్లి లో ఈనెల 24న వాల్మీకి మహర్షి దేవాలయ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటి మట్టం బుధవారం 513.70 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు



భట్టిప్రోలు: చుండూరు మండలం చినపరిమిలో గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 24న రథోత్సవం నిర్వహిస్తారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
గుంటూరు	6.24	4.55
నరసరావుపేట	6.26	4.57
బాపట్ల	6.24	4.55

న్యూస్‌రీల్

ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే తొలగిస్తాం
కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



గుంటూరు వెస్ట్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వలంటీర్లు ప్రచారంలో పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు గౌరవ వేతనాలు తీసుకునే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ రాజకీయ పార్టీ ప్రచారాల్లో గానీ లేక వారికి అనుకూలంగా వ్యవహరించినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. పొన్నూరు, పెదకాకాని ప్రాంతాల్లోని వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిని తొలగిస్తామని తెలిపారు. బహిరంగ, ప్రైవేటు స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శనకు రాజకీయ పార్టీలు అనుమతులు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కరపత్రాలు, ఆడియో, వీడియో సందేశాలకు ముందస్తుగా ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ ప్రచారాలు చేసుకోవచ్చని సూచించారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీ కుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజ్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు
విస్తృతంగా వాహనాల తనిఖీ



తాడేపల్లి రూరల్ : ప్రకాశం బ్యారేజ్ వద్ద తాడేపల్లి పోలీసులు బుధవారం ప్రత్యేక చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు కృష్ణా, గుంటూరు జిల్లాలను వేరుచేస్తున్న ప్రకాశం బ్యారేజ్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. రానున్న ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకుని అక్రమంగా నగదు కానీ సరైన పత్రాలు లేకుండా వస్తువులను రవాణా చేసినా సీజ్ చేస్తామని చెప్పారు. వ్యక్తుల వద్ద సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదు ఉంటే సీజ్‌చేసి ఎన్నికల కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. 24 గంటలు చెక్‌పోస్టులో విస్తృత తనిఖీలు జరుగుతాయని పేర్కొన్నారు. అనుమానం వచ్చినా, ఎవరైనా ఫిర్యాదు చేసినా, రాజకీయ నాయకులతో పాటు ఇతరుల వాహనాల్ని సైతం తనిఖీ చేస్తామని స్పష్టం చేశారు. పోలీసులకు రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పచ్చ నేతల బరితెగింపు

- ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఇంటిపై దాడి
- స్వయంగా పాల్గొన్న టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు
- 200 మంది రౌడీమూకలతో 20 కార్లలో రాక
- మద్యం మత్తులో దుర్భాషలు
- వేసేస్తాం...చంపేస్తాం అంటూ బెదిరింపులు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ముగ్గురికి గాయాలు
- నాయకులు ఎదురు దాడికి దిగటంతో పలాయనం
- ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నేతలు

గుంటూరు రూరల్: ఓటమి భయం పచ్చనేతల వెన్నులో ఒణుకు పుట్టించింది. బెదిరించి, దాడి చేసి ప్రత్యర్థిని భయభ్రాంతులకు గురి చేయాలని టీడీపీ మూకలు ముందస్తు ప్రణాళికతో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఇంటిపై దాడిచేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ...దేశంలో ఎన్నడూ లేని విధంగా, సభ్య సమాజం తలదించుకునే సంఘటనకు ప్రత్తిపాడు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు నాంది పలికాడు. ఓటమి భయంతో ఎలాగైనా ప్రత్యర్థిని భయభ్రాంతులకు గురి చేయాలని పూటుగా మద్యం తాగి సుమారు 20 కార్లతో 200 మంది రౌడీ మూకలను తీసుకుని బుధవారం మధ్యాహ్నం ముందస్తు పథకం ప్రకారం జేకేసీ కళాశాల రోడ్డులోని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఇంటిపైకి దాడికి దిగబడ్డాడు. కారుల్లో రాళ్లు, కర్రలు, మారణాయుధాలతో వచ్చాడు. ఆగి ఆగక ముందే కిరణ్‌కుమార్ ఇంటిపైకి రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. 'ఎవరు అడ్డు వచ్చినా వేసేయండిరా' అంటూ రౌడీ మూకలను రెచ్చగొట్టాడు బూర్ల రామాంజనేయులు. అదే సమయంలో బలసాని ఇంటి వద్ద నున్న పది మంది



దాడి జరిగిన జేకేసీ కళాశాల రోడ్డులో కిరణ్‌కుమార్ నివాసం

కారు డ్రైవర్లు, కార్యకర్తలు అడ్డుకోవడంతో టీడీపీ రౌడీ మూకలు వారిపై దాడి చేశారు. మహిళలను సైతం అసభ్య పదజాలంతో కులం పేరుతో దూషించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిని కులం పేరుతో దూషిస్తూ 'బయటకు రండిరా' అంటూ దుర్భాషలాడుతూ అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యర్తలు, డ్రైవర్లపై దాడి



గాయపడిన ఇంద్రబాబు, వెంకటప్పారెడ్డి, అబ్బులు

చేశారు. చంపేస్తాం... లేపేస్తాం.. ఎవరడ్డు వచ్చినా చంపుతాం.. అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసి బెదిరించారు. దీంతో కార్యకర్తలు అప్రమత్తమై ఎదురు దాడికి దిగారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సైతం వీడియోలు తీస్తూ ఎదురు దాడికి దిగి రామాంజనేయులు కారును అడ్డగించటంతో రౌడీ మూకలు అక్కడినుంచి వెనక్కుతిప్పి జారుకునే ప్రయత్నం చేశారు. కారుకు అడ్డువచ్చి వారిని తొక్కుకుంటూ పరారయ్యారు.

పోలీస్ స్టేషన్‌లోనూ దాడికి యత్నం
చేసిన తప్పు ఎక్కడ దొరుకుతామోనని భయంతో టీడీపీ బూర్ల రామాంజనేయులు, రౌడీ మూకలు పలాయనం చిత్తగిస్తూ నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ కార్యర్తలు, దాడిలో గాయపడిన ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని వ్యక్తిగత డ్రైవర్ ఇంద్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, పిల్లి మేరి, తాళ్ల అబ్బులు కార్యకర్తలతో కలిసి తమపై జరిగిన దాడిని పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ కూడా టీడీపీ రౌడీలు, గూండాలు మరోసారి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడికి ప్రయత్నించారు. సీఐ నరేసకుమార్, సిబ్బంది ఇద్దరికి సర్ది చెప్పి అక్కడినుంచి పంపివేశారు. దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యర్తలు ఇచ్చిన ఫిర్యాదును సీఐ నరేష్‌కుమార్ స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తమపై కూడా దాడి చేశారని బూర్ల రామాంజనేయులు సైతం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

డ్రైవర్ చేతికి తీవ్ర గాయం
దాడిలో ఎమ్మెల్యే అభ్యర్థి కిరణ్‌కుమార్ వ్యక్తిగత డ్రైవర్ ఇంద్రబాబు చేతికి తీవ్ర గాయమైంది. గోరంట్లకు చెందిన తాళ్ల అబ్బులను రౌడీ మూకలు కిందపడేసి దాడికి ప్రయత్నించగా చొక్కా చిరిగి శరీరంపై గాయాలయ్యాయి. మహిళా నాయకురాలు పిల్లి మేరిని సైతం మహిళ అని కూడా చూడకుండా దాడిచేసి కొట్టారని ఆందోళన వ్యక్తం చేసింది. నోటితో చెప్పరాని విధంగా దుర్భాషలాడారని వాపోయింది. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి కాళ్ల పైకి టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు కారుతో తొక్కించాడు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన ర్యాలీ
జేకేసీ కళాశాల రోడ్డులోని ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని ఇంటి వద్ద నుంచి ఆర్‌టీవో కార్యాలయం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నిరసన ర్యాలీని చేపట్టారు. ఎన్నికల కమిషన్ బూర్ల రామాంజనేయులుపై తగిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.



ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌తో కలసి ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న నేతలు

టెన్త్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు
ఇంగ్లిష్ పరీక్షకు 97.89 శాతం హాజరు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 97.89 శాతం హాజరు నమోదైంది. టెన్త్ పరీక్షల జిల్లా పరిశీలకురాలు పి.పార్వతి, జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ వివిధ పరీక్ష కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చేబ్రోలులోని ప్రెసిడెన్సీ స్కూల్, నారాకోడూరు జెడ్పీ హైస్కూల్, సంగం జాగర్లమూడి జెడ్పీ హైస్కూల్, వడ్లమూడిలోని చాణక్య హైస్కూల్, వేజెండ్ల జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను డీఈవో పి.శైలజ తనిఖీ చేయగా, పి. పార్వతి గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారు. అదే విధంగా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు కలుపుకుని మొత్తం 76 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. వరుసగా మూడో రోజు జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు. 147 కేంద్రాల్లో కేటాయించిన 27,753 మంది విద్యార్థుల్లో 27,169 మంది హాజరయ్యారు.

ప్రైవేటు బస్సుపై కేసు నమోదు
పట్నంబజారు: ఎన్నికల నియమావళిని అతిక్రమించి టీడీపీకి సంబంధించిన స్టిక్కర్లను బస్సు అంటించి తిప్పుతున్న ప్రైవేటు కళాశాల బస్సుపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా కథనం ప్రకారం.. బుధవారం నాజ్‌సెంటర్‌లో తిరుగుతున్న ఎంసీసీ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం–3 ఇన్‌చార్జి వి.అనుపమ కిట్స్ కళాశాల బస్సుపై టీడీపీ స్టిక్కర్లు ఉండటాన్ని గమనించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ బస్సుపై స్టిక్కర్లు ఉన్న నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి అమానుషం..

- టీడీపీ అభ్యర్థిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటిపై దాడిని ఖండించిన నేతలు
- జిల్లా ఎస్పీ తుషార్ డూడీకి ఫిర్యాదు

నగరంపాలెం: ప్రత్తిపాడు వైఎస్సార్ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌పై దాడి చేయడాన్ని పార్టీ తరఫున ఖండిస్తున్నట్లు శాసన మండలి విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. గుంటూరు జేకేసీ కళాశాల రోడ్‌లోని కిరణ్‌కుమార్ ఇల్లు, తాత్కాలిక కార్యాలయంపై టీడీపీ నేతల దాడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో అప్పిరెడ్డి మాట్లాడుతూ ఒక అధికారిగా, చట్టాలపై అవగాహన ఉన్న వ్యక్తి, గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన టీడీపీ ప్రత్తిపాడు అభ్యర్థి బూర్ల రామాంజనేయులు కార్లల్లో రౌడీలతో వచ్చి దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇటువంటి దాడులతో సమాజానికి ఎటువంటి సంకేతాలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. అభ్యర్థులను భయపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సరికాదని హితవు పలికారు. కిరణ్‌కుమార్‌పై దాడికి సంబంధించి అంశాన్ని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వలంటీర్లు ఇళ్లల్లో ఎందుకు ఉంటారని, కిరణ్‌కుమార్‌ను బెదిరించి, భయపెట్టాలని చేసిన ప్రయత్నాలను ప్రజలు గమనించాలని ఆయన సూచించారు. పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య మాట్లాడుతూ కిరణ్‌కుమార్ ఇల్లు, కార్యాలయంపై టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు దౌర్జన్యం చేయడం దారుణమని ఖండించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిని నూరిఫాతిమా, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, కార్పొరేటర్ స్మిత



అభ్యర్థులతో కలసి మాట్లాడుతున్న అప్పిరెడ్డి

పద్మజ, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఓడిపోతామనే భయంతోనే దాడి
ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మధ్యాహ్నం 12–1 గంట సమయంలో టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు రౌడీలు, గుండాలతో వచ్చారని తెలిపారు. కార్యాలయంలో సమావేశంలో ఉండగా తనను దుర్భాషలాడారని ఆందోళన వ్యక్తం చేశారు. రామాంజనేయులు స్వయంగా వచ్చి ఒక అభ్యర్థి ఇంటిపై పాల్పడటం దారుణమని ఖండించారు. ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన దాడులకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. మహిళా నాయకురాలు పిల్లి మేరీని అసభ్యంగా మాట్లాడి తోసేశారని తెలిపారు. డ్రైవర్ ఇంద్రబాబుపై దాడికి పాల్పడగా, బొటన వేలికి గాయమైందని విలేకర్లకు చూయించారు. బూర్ల రామాంజనేయులపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో దాడికి ఒడిగట్టారని అన్నారు.

యాలి వాహనంపై నారసింహుడు

మంగళగిరి: పట్టణంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామి యాలి వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. వ్యాళి వాహనమునే యాలి వాహనం అంటారు. హింసించే స్వభావం ఉన్న క్రూరులను శిక్షించి, సాధువులను రక్షించేందును తానున్నానని తెలియజేసేందుకు లక్ష్మీనారసింహస్వామికి యాలి వాహన ఉత్సవం నిర్వహిస్తారు. యాలి వాహన రూఢుడైన స్వామిని దర్శిస్తే దుర్మార్గుల వల్ల భయం నశిస్తుందని భక్తుల నమ్మకం. ఆలయ ఈవో ఏ. రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించగా, అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవ కైంకర్యపరులుగా పట్టణానికి చెందిన మురికిపూడి పుష్పవేణి, కుమారులు వ్యవహరించగా భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ



యాలి వాహనంపై స్వామి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు సింహ వాహనంపై విహరించనున్న స్వామి
బ్రహ్మోత్సవాలలో భాగంగా నరసింహస్వామి గురువారం ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి ఏడు గంటలకు సింహ వాహనంపై గ్రామోత్సవంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని ఈవో ఏ. రామకోటిరెడ్డి తెలిపారు. భక్తులు దర్శించుకుని స్వామి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ముత్యాల పందిరి వాహనంపై..
స్వామి బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ముత్యాల పందిరి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కైంకర్యపరులుగా రంగా ఉపేంద్రవర్మ దంపతులు వ్యవహరించారు.

ఎన్నికల్లో ప్రజలే వైఎస్ జగన్ బలం

- నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్
- బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ప్రచారం

బెల్లంకొండ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలే బలం అని నరసరావుపేట వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, న్యూచిట్యాల, చంద్రాజుపాలెం, వన్నాయపాలెం, కందిపాడు గ్రామాలలో ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. తొలుత నాగిరెడ్డిపాలెంలో పార్టీ నాయకులు బాణసంచా కాల్చుతూ ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాయలంలో వివిధ గ్రామాల నాయకులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, అనిల్ కుమార్ యాదవ్‌కు పరిచయం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీతో బెల్లంకొండకు తీసుకెళ్లారు. ప్రచార రథం మీద నుంచి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రజలకు అభివాదం చేసుకుంటూ కదిలారు. బెల్లంకొండలో పార్టీ కార్యాలయంలో నాయకులతో మాట్లాడారు. అదే విధంగా బెల్లంకొండ గ్రామంలో మైనార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. న్యూచిట్యాల వెళ్లిన అభ్యర్థులకు కాలనీకి చెందిన సుగాలీ మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రాజుపాలెంలో బీసీ సామాజిక వర్గ ప్రజలు ఎమ్మెల్యేకు శంకరరావు, అనిల్‌యాదవ్‌లకు బ్రహ్మరథం పట్టారు.



చంద్రాజుపాలెం సభలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నంబూరు

చంద్రాజుపాలెంలో బహిరంగ సభలో అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కొత్త అబద్ధాలతో కూటమి నాయకులు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని హెచ్చరించారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను నమ్ముకున్నారని, చంద్రబాబు మాత్రం మోదీని, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియాను నమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనను నెల్లూరు జిల్లాలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసి రాష్ట్ర స్థాయిలో ఒక గుర్తింపు ఇచ్చారన్నారు. పల్నాడు జిల్లాకు ఒక బీసీని ఎంపీ అభ్యర్థిని పెట్టాలన్న ఆలోచనతో తనను ఎంపీగా వెళ్లమంటే ఒక్కమాట కూడా ఎదురు చెప్పకుండా ఆయన మీద విశ్వాసంతో పల్నాడుకు వచ్చానన్నారు. నరసరావుపేటకు బీసీకి అవకాశం కల్పించాలని, ప్రస్తుత ఎంపీని గుంటూరుకు వెళ్లమంటే... పార్టీకి వెన్నుపోటు పొడిచి ఏకంగా పార్టీ మారిన వ్యక్తులను పల్నాడు ప్రజలు, బీసీలు గమనించాలని కోరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన వారు చేయని అభివృద్ధి కార్యక్రమాలు తాను చేసి చూపించానని తెలిపారు. కార్యక్రమాలలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైస్ ఎంపీపీలు మరియదాసు, అహ్మద్‌పాషా, సొసైటీ చైర్మన్ భద్రయ్య, సర్పంచులు గంగిరెడ్డి ప్రతాపరెడ్డి, ఆసుల జగన్, బద్దూరి శేషిరెడ్డి, బి.నరసింహానాయక్, బాబూజీ, ఎం.త్రివేణి వెంకటస్వామి, కె.పాప, ప్రకాష్, సైదయ్య, బ్రహ్మం, ఎంపీటీసీలు నరసింహనాయక్, మాదాసు రాంబాబు, మాజీ ఎంపీపీ బద్దూరి చంద్రారెడ్డి, పమ్మి నర్సిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దరియా, మౌలాలి, సిరిపురం మేస్త్రీ పాల్గొన్నారు.

శింగరకొండ తిరునాళ్లకు ఏర్పాట్లు

- 23 నుంచి ప్రారంభం
- 25న ప్రధాన తిరునాళ్ల

అద్దంకి: అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి శింగరకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ కోరారు. శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం రెండో సమన్వయ కమిటీ సమావేశాన్ని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి. సుభద్ర అధ్యక్షతన నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభలపై పార్టీల జెండాలు, లైటింగ్ ఏర్పాటు చేస్తే నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేస్తామని చెప్పారు. ప్రభల వద్ద అత్యధిక మైక్‌లు, అసభ్యకరంగా డ్యాన్స్‌లు నిర్వహించడానికి వీల్లేదని తెలిపారు. బాణసంచా పేల్చడానికి అనుమతి లేదని స్పష్టం



సమావేశంలో పాల్గొన్న పోలీసులు, అధికారులు

చేశారు. ప్రధాన తిరునాళ్ల రోజున రాష్ట్రీయ రహదారిపై నడిచే పెద్ద వాహనాలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా దారి మళ్లిస్తామని, ఆంక్షలపై ప్రకటన చేస్తామని చెప్పారు. ఆర్కెస్ట్రా, డ్యాన్స్ పార్టీల వారిని ముందుగానే బైండ్ ఓవర్ చేయాలని సీఐ కృష్ణయ్యను ఆదేశించారు. 99 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద పార్కింగ్ ఉంటుందని చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 780 నుంచి 800 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏసీ సుభద్ర మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి తిరునాళ్లను ప్రారంభిస్తామని తెలిపారు. భక్తులు కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఉచిత ప్రసాదం, మంచి నీరు మజ్జిగ అందిస్తామని చెప్పారు. తాత్కాలిక స్నాన గదులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీఐపీలకు ప్రత్యేక సమయంలో దర్శనం, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆర్టీసీ తరఫున ప్రత్యేక తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. 25న అద్దంకి, దర్శి, పొదిలి, ఒంగోలు, నరసరావుపేట, వినుకొండ, చీలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

జాతి సమైక్యతకు ప్రతీక హిందీ భాష

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ దక్షిణ రాష్ట్రాల సంచాలకులు ఎం.ఎం.నటరాజ్



నెహ్రూనగర్: భారత దేశ జాతి సమైక్యతకు ప్రతీక హిందీ భాష అని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ దక్షిణ రాష్ట్రాల సంచాలకులు ఎం.ఎం.నటరాజ్ పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ గుంటూరు ఆధ్వర్యంలో బుధవారం నెహ్రూ యువ కేంద్ర సిబ్బందికి రాష్ట్రస్థాయి రాజ భాష హిందీ కార్యశాలను నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్, యానాం రాష్ట్రాల సంచాలకులు ఏ ఆర్ విజయరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ జాతీయ భాష, జన ప్రియమైన భాష, అతి సుందర భాష, భారతీయులెందరో భాషించే భాష అని అన్నారు. మన దేశంలో కోట్లాది ప్రజల గుండెచప్పుడు వినిపించే హిందీ భాష, కార్యాలయ విధుల్లో అధికార భాష వినియోగం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ అశుతోష్ కుమార్ ప్రసాద్, ఆకాశవాణి విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్, హిందీ అనువాదకులు ఎం సుబ్బశేఖర్ అధికార భాష విధి విధానాలు, కంప్యూటర్‌లో రాజా భాష వినియోగాలపై శిక్షణను ఇచ్చారు. అనంతరం పోటీలలో గెలుపొందిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

ప్రత్యామ్నాయ పంటలు ఎంపిక చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: మారుతున్న వాతావరణ పరిస్థితుల అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకుంటే అధిక లాభాలు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ డి.శ్రీలక్ష్మి తెలిపారు. రావిపాడు ఆర్‌బీకే-1లోని డాట్ సెంటర్‌లో జిల్లాస్థాయి సమన్వయ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బెట్ట పరిస్థితులకు అనుకూలంగా పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. బెట్టను తట్టుకునే విత్తనాల రకాలను సాగు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

స్వర్ణకార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్



మాట్లాడుతున్న పారేపల్లి మహేష్

మంగళగిరి: స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని స్వర్ణకార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో మహేష్ విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుకు అంగీకరిస్తూ ప్రభుత్వం సర్క్యులేషన్ కాపీని జారీచేయడంతో కార్పొరేషన్ ఏర్పాటుకు తొలి అడుగు పడిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన కాపీని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్యలు తనకు అందజేసిన తర్వాతే దీక్ష విరమించానన్నారు. అయితే ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులేషన్ కాపీని సైతం కొందరు రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటులో రాజకీయాలు మానుకుని అందరూ ఏకతాటిపై ఉండి సాధించుకోవాలని, రాజకీయాలు చేసి ఆటలాడుకోవద్దని హితవు పలికారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో కార్పొరేషన్ ఏర్పాటు కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎన్నోసార్లు కలిసినా స్పందించ లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తూ ధృవీకరణ పత్రాన్ని మంజూరు చేసిన విషయాన్ని స్వర్ణకారులంతా గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జె.వరప్రసాద్, యు.నరేంద్ర, డి.నారాయణ, కె.ధనుంజయరావు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

తాడికొండ అడ్డరోడ్డులో రూ.74,600 నగదు, 770 గ్రాముల బంగారం స్వాధీనం



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

తాడికొండ: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తాడికొండ అడ్డరోడ్డులో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టులో బుధవారం వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎలాంటి బిల్లులు లేకుండా అనధికారికంగా తరలిస్తున్న రూ.74,600 నగదు, 770 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు నుంచి తాడికొండ వైపు వెళుతున్న కారులో 770 గ్రాముల బంగారు ఉన్నట్లు గుర్తించడంతో విచారించగా బ్యాంకులో తనఖా పెట్టేందుకు వెళుతున్నట్లు తెలిపారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నేపథ్యంలో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అమరావతి మండలం తమ్మవరం గ్రామానికి చెందిన మాడంశెట్టి సాంబశివరావు అనే వ్యక్తి స్కూటీలో రూ.74,600 ఉన్నట్లు గుర్తించి విచారించగా ఎలాంటి రసీదులు లేకపోవడంతో సదరు నగదు, బంగారాన్ని ఐటీ అధికారులకు పంపుతున్నట్లు ఆర్వో ఎం.గంగరాజు తెలిపారు. ఈ తనిఖీలలో తాడికొండ సీఐ ప్రభాకర్, ఎస్ఐ అంజయ్య, ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ మధుసూదనరావు, డీప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, పంచాయతీ రాజ్ పీఐయూ విభాగం ఏఈ సత్యన్నారాయణ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

చీరాల రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాలు.. రైల్వే స్టేషన్ దక్షిణం వైపు 65 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలు సుమారు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో గూడ్సు రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయాలపాలైన బాధితురాలిని చికిత్స నిమిత్తం 108లో చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే పరిశీలించిన వైద్యులు వృద్ధురాలు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతురాలి ఎత్తు 5.3 ఉంటుందని, గుండ్రని ముఖం, తలకు నెరిసిన వెంట్రుకలు ఉన్నాయని, కుడివైపు ముక్కు పుడక ఉందని పోలీసులు చెప్పారు. ఆమె శరీరంపై బులుగు రంగుపై ఎరుపు ఆకుపచ్చ రంగుల డిజైన్ చీర, వంగపువ్వు రంగు జాకెట్టు ఉందని, ఆమె ఎడమ చేతిపై పుట్టు మచ్చ, ఎడమ ఛాతిపై మరో పుట్టు మచ్చ ఉన్నట్లు చెప్పారు. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ వివరించారు.

నేను పక్కా లోకల్ ..గుంటూరు కారం !

- తుపాకులతో కాలుస్తానంటే.. ఎవరూ భయపడరు
- 650 ఎకరాల్లో ధూళిపాళ్ల గ్రావెల్ మాఫియా
- పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య



మాట్లాడుతున్న కిలారి రోశయ్య, పక్కన పార్టీ నేతలు

పట్నంబజారు: అమెరికా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐలకు స్థానిక ప్రజల సమస్యలు ఏం తెలుస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య ప్రశ్నించారు. అమెరికాలో మాదిరిగా తుపాకులతో కాల్చేస్తానంటే ఎవరూ భయపడరని.. ఇక్కడ గుంటూరు మిర్చి కారం అని.. తాను పక్కా లోకల్ అని చెప్పారు. కృష్ణనగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం గుంటూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశమయ్యారు. శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని, శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య, పార్టీ నేత మేకతోటి దయాసాగర్ సమావేశంలో పాల్గొన్నారు. పార్లమెంటు పరిధిలోని పలు అంశాలపై చర్చించారు.

- అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ నిత్యం సామాజిక న్యాయం గురించి మాట్లాడే టీడీపీ నేతలు, సీట్లు కేటాయింపులో ఏమి పాటించారో చెప్పాలని, కేవలం డబ్బుల బరువు చూసి మాత్రమే సీట్లు ఇచ్చారని విమర్శించారు. చేబ్రోలులో గ్రావెల్ మాఫియా గురించి మాట్లాడున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి, కేవలం ఆ పార్టీ నేత ధూళిపాళ్ల నరేంద్ర రాసిచ్చిన స్క్రిప్టును చదివారని ఆరోపించారు. 650 ఎకరాల్లో గ్రావెల్ మాఫియా ఎవరు చేశారో.. అక్కడ ప్రజలనే అడిగి ఉంటే బాగుండేదని తెలిపారు. 30 ఏళ్లలో ధూళిపాళ్ల చేయలేని అభివృద్ధిని తాను చేసి చూపానని పేర్కొన్నారు.

కూటమి కుట్రలు, కుతంత్రాలు సాగవు : ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి

- రాష్ట్రంలో ప్రజలకు జరుగుతున్న మేలు అడ్డుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పన్నుతున్న కూటమి కుట్రలను ఓటు అనే ఆయుధంతో ప్రజలు బద్దలు కొడతారని శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేశారు. 175కి 175, 25 ఎంపీ స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.
- పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ విప్లవానికి నాంది పలికి.. ప్రతి పేదవాడి గుమ్మం వద్దకు పాలన తీసుకు వెళ్లిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జగనన్నే తిరిగి ముఖ్యమంత్రి కావాలని పేదలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.
- తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని పాటిస్తూ.. సీట్లు కేటాయింపులో అన్ని వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. కాపులకు సైతం ఎంతో ప్రాధాన్యత కల్పించారని, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలకు పెద్దపీట వేశారని తెలిపారు.
- మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య మాట్లాడుతూ మంగళగిరి అభ్యర్థిగా తనని నియమించిన సీఎం వైఎస్. జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలకు అగ్రతాంబూలాన్నిచ్చి మరోమారు తాను మహిళా పక్షపాతినని ఆయన నిరూపించారని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేత కాండ్రు కమల పాల్గొన్నారు.

సామాన్యులకూ ఎన్నికల కోడ్

కొరిటెపాడు(గుంటూరు): ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు మాత్రమే కాకుండా సామాన్యులు కూడా కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. నిష్పక్షపాత ఎన్నికల కోసం ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తోంది. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను తూచా తప్పకుండా పాటించాలి. లేదంటే కోరి చిక్కులు తెచ్చుకున్నట్లే అని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అంటే రాజకీయ నాయకులకే కదా మనకేం ఇబ్బందని అంతా అనుకుంటారు. కానీ కొన్నిసార్లు సామాన్యులు కూడా ఇబ్బందు ఎదుర్కోవాల్సి రావచ్చు. తప్పు చేయకపోయినా అధికారులకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల కోడ్ వల్ల నగదు రవాణాపై ఆంక్షలు ఎక్కువగా ఉంటాయి. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేసిన సమయంలో సామాన్యులు ఎవరైనా నగదును తరలిస్తున్నప్పుడు సరైన పత్రాలు లేకపోతే ఎవరి డబ్బైనా అధికారులు స్వాధీనం చేసుకుంటారు.

రూ.50 వేలు మించితే వివరణ ఇవ్వాలి..

రూ.50 వేల కన్నా ఎక్కువ నగదును సామాన్యులు తరలిస్తే పూర్తిగా వివరణ ఇవ్వాలి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? ఎక్కడికి తీసుకుని వెళ్తున్నారు.. తదితర విషయాలు చెప్పాల్సి ఉంటుంది. మీ సమాధానంలో తేడా ఉన్నా చెప్పిన దానిలో వాస్తవం లేకపోయినా ఆ నగదును అధికారులు స్వాధీనం చేసుకుంటారు. సరైన ధృవ పత్రాలు చూపించాకే మీ నగదు మీకు తిరిగి అప్పగిస్తారు. అంతవరకు మీ నగదు కోర్టు కస్టడీలో ఉంటుంది. ఎన్నికల కౌంటింగ్ అయ్యేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. నగదు మాత్రమే కాకుండా బంగారం, వెండి తదితర ఆభరణాలు, విలువైన వస్తువులు ఏవైనా సరే అనుమానం వస్తే అధికారులు స్వాధీనం చేసుకుంటారు. బంగారం, వెండి తదితర వర్తకులు సైతం తగిన పత్రాలు పట్టుకునే ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. లేదంటే యిక్కులు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు.

మాకు కనిపించవంతే!

- టీడీపీ, బీజేపీ నేతల చిత్రాలు తొలగించని యంత్రాంగం
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు గాలికి వదిలేసిన వైనం



పట్టణంలోని తారకరామా సాగర్‌లో ముసుగు పడని ఎన్టీఆర్ భారీ విగ్రహం



పట్టణంలోని వావిలాల మెమోరియల్ పార్క్‌లో చంద్రబాబు పేరుతో శిలాఫలకం

సత్తెనపల్లి: ఎన్నికలు నియమావళి నిబంధనలు ప్రతిపక్ష పార్టీకి వర్తించవా.. అంటే అవుననే సమాధానం వస్తుంది.. కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులు అవుతున్నా అధికారులు మొద్దు నిద్ర వీడలేదు. ఎన్నికల సంఘం ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారు. పట్టణంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి విగ్రహాలకు ముసుగులు, వైఎస్సార్ సీపీ చిత్రాలు తీయడంలో చూపిన ఆసక్తి టీడీపీ, బీజేపీ విషయంలో చూపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రధాన రహదారి డివైడర్ల పైన, శిలాఫలకాలపైన ఇలా ఎక్కడ పడితే అక్కడ టీడీపీ, బీజేపీ నాయకుల చిత్రాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల ముంగిట ఓటర్లను ప్రభావితం చేయాలన్న ఉద్దేశంతోనే ఆ వ్యవహారం సాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లోగా రాజకీయ ప్రచారానికి దోహదపడే ఫ్లెక్సీలు, విగ్రహాలకు ముసుగులు, శిలాఫలకాల్లో పేర్లు కనిపించకుండా చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులు అవుతున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని తారక రామా సాగర్‌లో ఎన్టీఆర్ భారీ విగ్రహానికి ముసుగు వేయలేదు. పట్టణంలోని ప్రధాన రహదారిలో డివైడర్‌పై సకల జనుల సౌభాగ్య ఆంధ్రప్రదేశ్ అంటూ ప్రధాని మోదీ చిత్రంతో కూడిన వాల్‌పోస్టర్ ఉన్నప్పటికీ తొలగించలేదు. వావిలాల గోపాలకృష్ణయ్య మెమోరియల్ పార్కులో చంద్రబాబు నాయుడు పేరుతో తాటికాయ అంత అక్షరాలతో శిలాఫలకం ఉన్నా ముసుగు వేయలేదు. అధికారులు కావాలనే కొన్ని ప్రచార విగ్రహాలను, వాల్‌పోస్టర్లను తొలగించకుండా టీడీపీ, బీజేపీ పార్టీలకు కొమ్ముకాస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రైల్వే నిబంధనలు అతిక్రమించొద్దు

- కదులుతున్న రైళ్లను ఎక్కడం, దిగడం చట్టరీత్యా నేరం
- డీఆర్ఎం రామకృష్ణ



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలు రైల్వే ట్రాక్‌లను దాటేటప్పుడు, కదులుతున్న రైళ్లను ఎక్కడానికి దిగడానికి ప్రయత్నించడం వంటి అసురక్షిత పద్ధతులను పాటించడం వల్ల ప్రాణహాని కలిగే అవకాశం ఉందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ చర్యల వల్ల ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లడమే కాకుండా ఆ రైలు సేవలు సజావుగా నడవడానికి కూడా అంతరాయం ఏర్పడుతుందన్నారు. దక్షిణ మధ్య రైల్వే అసురక్షిత పద్ధతుల విషయంలో రైలు ప్రయాణికులతో సహా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. తద్వారా భద్రతను నిర్ధారించడంలో ప్రజల ప్రాణాలను రక్షించడంలో రైల్వేలతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే రైలు వినియోగదారులు సాధారణ రైల్వే సేవలను వినియోగించుకున్నప్పుడు ట్రాక్‌లను ఒకవైపు నుంచి మరొక వైపుకు దాటేటప్పుడు జాగ్రత్తలను పాటించాల్సిందిగా కోరారు. ప్రధానంగా రైలు ప్లాట్‌ఫారం నుంచి బయలుదేరే సమయంలో లేదా చేరుకునే సమయంలో రైళ్ల ఎక్కి దిగే ప్రయత్నం చేయరాదన్నారు. రైళ్లు ఎక్కేటప్పుడు ప్లాట్‌ఫారం ఉపయోగించాలని, నిషేధిత ప్రాంతం నుంచి రైలులోకి ప్రవేశించరాదన్నారు. దయచేసి రైల్వే స్టేషన్‌లలో మార్గం మధ్యలో రైల్వే ట్రాక్‌లను దాటడానికి ప్రయత్నించ వద్దన్నారు. దీనికి బదులుగా రైల్వే ట్రాక్‌ల మీదుగా వెళ్లడానికి ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సబ్‌వేలు, రోడ్ ఓవర్, అండర్ బ్రిడ్జిలు, రైల్ క్రాసింగ్‌లు వంటి వాటిని వినియోగించాల్సిందిగా తెలిపారు. రైల్వే ట్రాక్‌ల దగ్గర నడుస్తున్నప్పుడు రైళ్లు ఎక్కేటప్పుడు, దిగుతున్నప్పుడు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించరాదన్నారు. రైల్వే ట్రాక్‌ల పరిసరాల్లో గుమికూడడం, ట్రాక్ దగ్గర ఎలాంటి కార్యకలాపాలలో పాల్గొనకూడదన్నారు. రైల్వే ట్రాక్‌ల పరిసర ప్రాంతాల్లో సెల్ఫీ, ఫొటోగ్రఫీ తీసుకోవడం వంటి చర్యలు నిషేధించడం జరిగిందన్నారు. నిబంధనలు ఉల్లఘించిన పక్షంలో ఆరు నెలల వరకు జైలు శిక్ష, వెయ్యి రూపాయల వరకు జరిమానా ఉంటుందన్నారు.

విద్యార్థి అదృశ్యం

మార్టూరు: ఇటీవలఇంటర్ పరీక్షలు రాసిన ఓ విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటనపై మంగళవారం రాత్రి కేసు నమోదైంది. సీఐ ఎస్‌వీ రాజశేఖర రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన జడా ఏడుకొండలు కుమారుడు జడా వెంకట రేవంత్(17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఎంసెట్ పరీక్షకు దరఖాస్తు చేయాలంటూ తండ్రి వద్ద రూ.1,100 తీసుకుని ఈ నెల 15 ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద కుమారుడి ఆచూకీ కోసం ప్రయత్నించినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో ఏడుకొండలు కుమారుడి అదృశ్యం విషయమై ఫిర్యాదు చేశాడు.

స్ఫూర్తినిచ్చే చలనచిత్రాలను ప్రోత్సహించాలి

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్



చిత్రబృందాన్ని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: యువత భవిష్యత్‌కు స్ఫూర్తి నిచ్చే చిత్రాలను సినీ పరిశ్రమ ప్రోత్సహించాలని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ సూచించారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో నూతన తెలుగు చలనచిత్రం కలియుగం పట్టణంలో చిత్ర బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం తమ కళాశాలకు రావటం సంతోషకరమన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజెరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్‌లు చిత్ర విశేషాలను తెలిపారు. యువతపై సినిమా ప్రభావం అధికంగా ఉంటుందని, దానిని పరిగణలోకి తీసుకుని కుటుంబ గౌరవం, మానవతా విలువలు పెంచే కథనాంశాలతో కూడిన చిత్రాలను నిర్మిస్తూ ప్రేక్షక ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షక ఆదరణతో మంచి గుర్తింపు తెచ్చుకున్న విశ్వ కార్తికేయ ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయం అవ్వటం సంతోషకరమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సృష్టిలో స్త్రీ పాత్రను తెలుపుతూ, కుటుంబ కథా నేపథ్యంతో సాగుతూ, థ్రిల్లింగ్ , వినోదాత్మకంగా చిత్ర నిర్మాణం జరిగిందని, ఈ నెల 29న థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుందని, ప్రతి ఒక్కరు ఈ చిత్రాన్ని ఆదరించాలని సినీ హీరో, హీరోయిన్ ఆయుషి, నిర్మాత, దర్శకులు మహేష్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి కోరారు. చిత్రబృందాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ పీ కిషోర్ తదితరులు అభినందించారు.